సాక్షి
సంగారెడ్డి

ఆదివారం । 29 । జనవరి । 2023



కారు టైరు మారుస్తుండగా..
కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో



రైతును వేధిస్తున్న మొగిపురుగు 8లో
వరి పైరుకు సోకుతున్న మొగి పురుగుతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గుర్తించిన వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



పొంచి ఉన్న ప్రమాదం
తెల్లాపూర్‌లో రైల్వే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. వనం చెరువు నుంచి వెళ్లిన నీరు ట్రాక్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి చేరి మురుగుకూపాన్ని తలపిస్తోంది. 9లో

న్యూస్‌రీల్

జోగినాథ రథానికి ప్రత్యేక పూజలు



రథాన్ని లాగుతున్న భక్తులు

జోగిపేట(అందోల్): రథసప్తమిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని జోగినాథ ఆలయం వద్ద రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఇప్పుడు కూడా రథపూజ నిర్వహించిన అనంతరం తాళ్లతో రథాన్ని కొద్దిసేపు ముందుకు, వెనక్కి కదిలించారు. రథసప్తమి సందర్భంగా పట్టణంలోని ప్రజలు తమ ఇళ్ల ముందు వేసిన రథం ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ డాకూరి శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు డీబీ నాగభూషణం, ఎం.మల్లికార్జున్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు చింత కుంట భిక్షపతి, అల్లె గోపాల్, సునీల్‌కుమార్, సీహెచ్.వెంకటేశం, జనార్దన్‌గౌడ్, అరిగె యాదయ్య, మహేందర్ పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

క్షయ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి



పోషకాహారం కిట్లను అందిస్తున్న దృశ్యం

సంగారెడ్డి టౌన్: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని క్షయ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా క్షయ కార్యాలయంలో తాళ్లపల్లి సర్పంచ్ అంకిని ప్రవీణ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారు. వారికి 6 నెలలకు సరిపోను పోషకాహారం కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గుతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయకూండా దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అరుణ, జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, చెన్నయ్య, ప్రభాస్, సుధ, నరసింహ, శ్రీకాంత్, శ్రీనాథ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


ఎక్కువ కేసులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న అదనపు జడ్జి సుదర్శన్

సంగారెడ్డి టౌన్: లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేలా కృషి చేయాలని మొదటి అదనపు జిల్లా జడ్జి సుదర్శన్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, సంగారెడ్డి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడే మల్లన్న లష్కర్ వారం



స్వామి వారి మూల విరాట్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. నేడు లష్కర్ వారం కావడంతో శనివారం సాయంత్రమే క్షేత్రానికి చేరుకుని దూళి దర్శనం చేసుకున్నారు. నేడు మల్లన్నకు పట్నం వేసి, బోనం సమర్పించడంతో పాటు అమ్మవార్లకు ఒడి బియ్యం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. లష్కర్‌వారం సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అసంపూర్తి పనులకు చెక్!

- పూర్తవడానికి ఆస్కారం ఉన్న పనులే ఎంపిక
- ఉపాధిహామీ పథకం అమలులో కొత్త నిబంధన
- వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రణాళికకు రూపకల్పన



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పథకంలో అసంపూర్తిగా వదిలేస్తున్న పనుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 100 శాతం పూర్తి చేయగలిగిన పనులను మాత్రమే రానున్న ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఉపాధి హామీపథకం 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా పూర్తి చేయగలిగే ఆస్కారం ఉన్న పనులను మాత్రమే గుర్తిస్తున్నారు. కొండాపూర్ మండలాన్నే ఉదాహరణగా తీసుకుంటే ఇప్పటివరకు సుమారు 1,805 పనులు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 504 పనులు అసలు ప్రారంభించనేలేదు. 30 శాతం పనులు చేసి వదిలేసినవి సుమారు 699 ఉన్నట్లు గుర్తించారు. ఇలా అసంపూర్తి పనులతో రూ.కోట్లలో నిధులు వృథా అవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

57.42 లక్షల పనిదినాలు.. 5,964 పనులు

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీపథకం కింద కూలీలకు మొత్తం 57.42 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. జిల్లాలో 647 గ్రామ పంచాయతీల పరిధిలో 4.26 లక్షల మంది కూలీలుండగా, 2.29 లక్షల జాబ్ కార్డులున్నాయి. ఇందులో 2.33 లక్షల మంది మాత్రమే తరచూ ఉపాధి పనులకు వెళ్తున్నట్లు గుర్తించారు. ఈ కూలీలంతా కలిపి గత మూడు సంవత్సరాల్లో సగటున 52.95 లక్షల పనిదినాలకు వచ్చినట్లు లెక్కించారు. ఈ సగటును ఆధారంగా చేసుకొని రానున్న ఏడాది.. 57.42 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

కేటగిరి – ఎ పనులకు ప్రాధాన్యం

- రానున్న ఆర్థిక సంవత్సరం అమలు చేయనున్న ఉపాధి హామీపనుల్లో కేటగిరి – ఎ పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఎ క్యాటగిరిలో చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, నీటి కుంటల నిర్మాణం వంటి పనులు ఉన్నాయి. ఇలా మొత్తం 5,964 పనుల్లో 2,548 పనులు ఎ కేటగిరికి సంబంధించినవి ఉన్నాయి.
- బీ కేటగిరికి సంబంధించి 1,750 పనులను చేపట్టారు. ఇందులో వ్యక్తిగత పనులు ఈ కేటగిరిలో ఉన్నాయి. ఉదాహరణకు క్యాటిల్‌షెడ్లు, హార్టికల్చర్‌కు సంబంధించిన పనులు ఉంటాయి.
- సి కేటగిరిలో కమ్యూనిటీ పనులకు సంబంధించి మట్టిరోడ్ల నిర్మాణం, వర్మీ కంపోస్ట్ షెడ్లు, నాడెపు షెడ్లు ఇలాంటి పనులు 695 చేపట్టనున్నారు. సుస్థిర ఆస్తులకు సంబంధించి డి క్యాటగిరిలో ఉన్నాయి. ఇందులో క్రీడా ప్రాంగణాలు, కనెక్టివిటీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, జీపీ బిల్డింగ్‌లు వంటివి 971 పనులు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

పట్టుదలతో విజయం సాధించాలి

గ్రూప్ – 1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టుదలతో శ్రమించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని గ్రూప్ 1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలపై అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్‌తో పాటు, ఎస్‌ఐ, కానిస్టేబుల్, ఎస్‌ఐ, తదితర పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించిందని, భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ 95 శాతం స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా నూతన జోనల్ విధానం తీసుకువచ్చారన్నారు. జిల్లా స్థాయి పోస్టులు ఆయా జిల్లా వాసులకే దక్కుతాయని తెలిపారు. అభ్యర్థులు భయం వీడి ఆత్మ విశ్వాసంతో విజయం సాధించాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. నిరుద్యోగులకు అన్నిరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివలింగయ్య మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సమయపాలనతో చదివితే విజయం సాధించవచ్చన్నారు. గ్రూప్ – 1 అధికారులు కాకర శ్రీనివాస్, నూతనకంటి వెంకట్, రజనీకాంత్ రెడ్డి, రాజాకృష్ణ మాట్లాడుతూ సిలబస్‌పై పట్టు సాధిస్తే విజయం వెంటే వస్తుందన్నారు. గత గ్రూప్ 2 రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకర్ నరేశ్ మాట్లాడుతూ తపన, సంకల్పబలం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, ఎక్సైజ్ సీఐ మధుబాబు, డిప్యూటీ తహసీల్దార్ నరేశ్, విష్ణు, సబ్జెక్ట్ నిపుణులు సుంకర రమాదేవి, సోషల్ వెల్ఫేర్ అధికారి, బీసీ వెల్ఫేర్ అధికారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్ ధనలక్ష్మి

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి కోరారు. శనివారం జోగిపేట కోర్టులో మండల లీగల్ సర్వీస్ కమిటీ జోగిపేట ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం శిబిరాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా కంటి పరీక్షలను నిర్వహించిన అవసరమైన కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తుందన్నారు. కోర్టులో పనిచేస్తున్న సిబ్బంది, అడ్వకేట్‌లు, జైలు సిబ్బంది, పోలీసు సిబ్బందితో పాటు మెజిస్ట్రేట్ కూడా కళ్లను పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి కంటి అద్దాలను, మందులను పంపిణీ చేశారు. డాక్టర్ అశోక్ నేతృత్వంలోని వైద్య సిబ్బంది ఈ శిబిరంలో సిబ్బందికి కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ హరినారాయణ వర్మ, బార్ అసోసియేషన్ సెక్రటరీ అల్లె శ్రీకాంత్, న్యాయవాదులు లింగమయ్య నర్సింలు, జోగిపేట సీఐ నాగరాజు, జోగిపేట ఎస్‌ఐ సోమ్యానాయక్, వట్‌పల్లి ఎస్‌ఐ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌కు విద్యార్థుల ఎంపిక



రంజిత్ రెడ్డి



మంజునాథ

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్‌కు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ యువజన పార్లమెంట్ ఫెస్టివల్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్‌కు కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి రంజిత్ రెడ్డి, నెహ్రూ యువజన కేంద్రానికి చెందిన మంజునాథ ఫిబ్రవరి 2వ తేదీన పర్సువల్ మోడ్ ద్వారా జరిగే 4వ రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఫిబ్రవరి 22వ తేదీన ప్రధాని సమక్షంలో పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం లభిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో మొదటి బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్షా పది వేలు, తృతీయ బహుమతి రూ.లక్షతో పాటు కన్సోలేషన్‌గా రూ.50 వేలు ప్రధాని చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేస్తారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం పట్ల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



బీదర్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో శనివారం ఆయన పర్యటించారు. అక్కడ ఆమ్‌ఆద్మీ పార్టీ బీదర్, సౌత్ బీదర్ ఎమ్మెల్యే అభ్యర్థులు సిద్దుపుకర్, రాజ్‌కుమార్ పాటిల్, బీదర్ జిల్లా ఉపాధ్యక్షుడు జమీల్ ఖాద్రి, పట్టణ ఉపాధ్యక్షుడు నదీమ్, పండరి శర్మ, ఎస్సీ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పుండ్లిక్, నాయకులు జావిద్, కంటెప్ప, దిలీప్ దొడ్మని, సంజీవ్‌కుమార్ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలంగాణలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. దేశ వ్యాప్తంగా మంచి పథకాల అమలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని చెప్పారు. వారిని పార్టీలో చేరాలని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన వారు చర్చించుకొని త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పార్శెట్టి సంగప్ప, ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు బాసిత్, అబ్బెంద సర్పంచ్ సుదర్శన్‌రావు పాటిల్ తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాలలో ట్యూటర్ పోస్టులు

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ట్యూటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి మెడికల్ కళాశాలలో 13 ట్యూటర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అనాటమీలో 3, ఫిజియాలజీ 4, బయో కెమిస్ట్రీ 2, ఫార్మకాలజీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్ ఎంఎస్సీ(మెడికల్) డిగ్రీలో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి 45 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఎంపికైన ట్యూటర్‌కు నెలకు రూ.57,700 కన్సాలిడేటెడ్ పే ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు ఈనెల 31 నుంచి సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల వెబ్‌సైట్ http://gmcsangareddy.org, డీఎంఈ వెబ్‌సైట్ dme.telangana.gov.in నుంచి పొందవచ్చని సూచించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థి ఆధార్, పాన్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్, ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు చదివిన స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్స్, బీఎస్సీ, ఎమ్మెస్సీ డిగ్రీ సర్టిఫికెట్స్, ఎంఎస్సీ మార్కుల మెమో జిరాక్స్ ప్రతులను సమర్పించాలని సూచించారు. ఫిబ్రవరి 6న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 98490 42789లో సంప్రదించవచ్చని కోరారు.

పంచవటిలో ఘనంగా రథసప్తమి



పంచవటి క్షేత్రం ఎదుట భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవాపూర్ – హుమ్నాపూర్ గ్రామాల శివారులోని పంచవటి క్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగిన వసంత పంచమి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. రథసప్తమిని పురస్కరించుకొని ఉదయం సూర్య భగవానుని ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, ఆలయం ఆవరణలో యజ్ఞాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో సూర్యభగవానుని ఆలయాలు ఎక్కడ లేకపోవడం కేవలం, పంచవటి క్షేత్రంలో మాత్రమే ఉండటంతో ఇక్కడ రథసప్తమి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. సమీపాన గల మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్షేత్రంలోని శారదాదేవి, సాయిబాబ, సూర్యభగవాన్, వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆహ్లాదానికి ‘చిల్డ్రన్ పార్క్’

సండే స్పెషల్

సదాశివపేటలో త్వరలో అందుబాటులోకి..
- రూ.1.5 కోట్లతో నిర్మాణ పనులు
- రూపుదిద్దుకుంటున్న అందమైన బొమ్మలు, నిర్మాణాలు



పార్క్ ప్రవేశ ద్వారం

సదాశివపేట(సంగారెడ్డి): దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆహ్లాదం.. ఆనందం, ఆరోగ్యం ఎంతో అవసరం. పట్టణ ప్రజల సౌకర్యార్థం సదాశివపేట మున్సిపాలిటీలోని పదో వార్డులో ఎవరెస్ట్ ఎన్‌క్లేవ్ సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మరో నెలలో ఈ పార్క్ బల్దియా ప్రజలకు అందుబాటులోకి రానుంది.

- ప్రముఖ వ్యాపార కేంద్రమైన సదాశివపేట మున్సిపాలిటీలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఇప్పటివరకు ఒక్క పార్క్ కూడా లేదు. మున్సిపాలిటీ జనాభా అధికారికంగా 52,500 ఉండగా అనధికారికంగా 75 వేల వరకు ఉండవచ్చని అంచనా. ఈ పురపాలికలో మొత్తం 26 వార్డులున్నాయి.
- పట్టణం మీదుగానే 65వ నంబర్ జాతీయ రహదారి ఉండటంతో అంతరాష్ట్ర రాకపోకలు బాగా పెరిగాయి. అంతేకాకుండా సదాశివపేట పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది కార్మికులు బతుకుదెరువు కోసం పని చేసుకునేందుకు ఇక్కడికి వస్తుండటంతో జనాభా రోజురోజుకు పెరిగిపోతోంది.
- ఉరుకులు పరుగుల జీవితంలో సాయంత్రం వేళ అలా బయటకు వెళ్లాలంటే ఎలాంటి పార్కులు లేకపోవడంతో స్థానికులు పిల్లలతో కలిసి వేరే ప్రాంతాలకు వెళ్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు స్థానికంగా ఆహ్లాదం పంచడానికి చిల్డ్రన్ పార్క్ నిర్మాణాన్ని చేపట్టారు.

అబ్బురపరుస్తున్న నిర్మాణాలు

- టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న పార్క్ మరో నెలలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. త్వరలోనే పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచనుంది. రెండెకరాల్లో నిర్మిస్తున్న ఈ పార్కులో ఆట వస్తువులు, బొమ్మలు, పండ్లు, ఫలాలు, పూలు, పక్షులు, తూనీగలు, జంతువులు, కూరగాయల ఆకారాల నిర్మాణాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.
- పార్క్‌లో అధునాతన వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచేలా మొక్కల పెంపకం చేపట్టారు. ఇప్పటికే అనేక బొమ్మలను తయారు చేయించారు. పండ్ల బొమ్మల కుర్చీలు ఇప్పటికే రూపుదిద్దుకున్నాయి. పిల్లలకు చెస్, పజిల్ ఆకారంలో కలపతో రెండు టెబుల్స్, కలప కుర్చీలను తయారు చేయించారు. ప్రవేశ ద్వారం వద్ద రెండు వైపులా ప్రహరీకి రకరకాల బొమ్మలు ఏర్పాటు చేశారు. వాటర్ ఫాల్, లైట్ల ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి.



పిల్లల కోసం ఏర్పాటు చేసిన చెస్ టేబుల్

త్వరలోనే ప్రారంభిస్తాం



పట్టణంలో నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే పట్టణ ప్రజలకు పార్క్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం. వాకింగ్ ట్రాక్, మొక్కల పెంపకం, పచ్చగడ్డి ఏర్పాటు, వాటర్ ఫాల్స్, లైట్లు వంటి జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని పనులు పూర్తవుతాయి.

– ఎస్.కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్



పార్కులో ఏర్పాటు చేసిన జారుడుబండ

క్లుప్తంగా

కేతకిలో దరియాపూర్ జడ్జి పూజలు



కేతకిలో ఆలయంలో జడ్జి తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయాన్ని మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దరియాపూర్ సివిల్ కోర్టు జడ్జి ఓం శంకర్ పాటిల్ శనివారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు జడ్జి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

పెయింటర్ ఆత్మహత్య

హుస్నాబాద్: పట్టణానికి చెందిన పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పట్టణ శివారులోని మహ్మదాపూర్ రహదారి సమీప మామిడి తోటలోని చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న గడ్డం ప్రవీణ్ (22) పట్టణంలోని కేబీ కాలనీ వాసిగా గుర్తించారు. మృతుడు పెయింటింగ్ పని చేస్తుంటాడనిని స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు నగల కోసం వృద్ధురాలి హత్య

మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో ఘటన



వృద్ధురాలి వివరాలు సేకరిస్తున్న పోలీస్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): బంగారు నగల కోసం వృద్ధురాలిని ఓ వ్యక్తి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందంపేటకు చెందిన వడియారం ఎల్లమ్మ(70) ఇంటి ఆవరణలో కూర్చొని ఉంది. ఒంటరిగా ఉన్న ఆమెను ఇంటి పక్కనే ఉంటున్న మేకల సిద్దిరాములు నమ్మించి శిథిలమైన అతడి పాత ఇంట్లోకి తీసుకెళ్లి హత్య చేశాడు. ఆమె మెడలోని బంగారు గుండ్లు, చెవి కమ్మలు దొంగలించాడు. కాగా వృద్ధురాలు కనిపించకపోవడంతో ఆరాతీయగా సిద్దిరాములు తీసుకెళ్లాడని స్థానికులు తెలిపారు. గ్రామస్తులను చూసి నిందితుడు పరారయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి బంగారాన్ని దొంగిలించేందుకు సిద్దిరాములు హత్య చేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779863]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ & 90300 44646. [B-1226251]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792805]

■ మహారాష్ట్ర మరియు కర్ణాటక నందు పనిచేయుటకు అనుభవం ఉన్న సైట్ సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ కావలెను PVR Projects Ltd Hyd. ఫోన్: 040-23348080, 23338080. E-Mail: adm.vineela@gmail.com [H-793551]

■ హైదరాబాద్‌లో ఇంటిపని, వంటపని మరియు పిల్లలను చూసుకొనుటకు 45 సం॥లోపు ఆడ పనివాళ్ళు కావలెను. జీతం: 15,000/-, భోజన వసతి కల్పించబడును. ఫోన్: 9063005675. [HA-13889]

■ Required Senior HR with any graduate - Male (5 yrs Exp) Labour Management Exp Required, Ability to give training to employees about the company policies, Plan and conduct New Employee Training, Location : Fuso Glass India Pvt Ltd,Pashamylaram,Patancheru(M) , Hyd, WhatsApp : 8897362019 [WB-50282]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతును వేధిస్తున్న ‘మొగిపురుగు’

- వరి పంటను ఆశిస్తున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- సమాచారం ఇవ్వాలంటున్న అధికారులు



జిన్నారంలో మొగిపురుగు ఆశించి పాడైన వరి పంట

జిన్నారం(పటాన్‌చెరు): రైతులకు మొగిపురుగు (కాండం తొలిచే పురుగు)ఓ శాపంలా మారింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగి పురుగు ఆశిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

- జిన్నారం మండలంలో 2500 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తుంటారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో 1600 మంది వరినాట్లు వేశారు.
- గుమ్మడిదల మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో 2500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.
- రైతులు వరి నాట్లను వేసి పదిరోజులు గడిచింది. ప్రస్తుతం వరి పంటకు అధికంగా మొగిపురుగు ఆశిస్తోంది.
- వరి పైరు ఎర్రగా మారుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
- ఈ సమస్యను పరిష్కరించేలా వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కారణాలు

- పంట మార్పిడి లేకపోవటం వల్ల పంటలకు వ్యాధులు సోకుతున్నాయి.
- ప్రస్తుత వాతావరణ మార్పులు కూడా ఈ పురుగు ఆశించడమే కారణం.
- నారుమడి(తుకం)పై భాగాన్ని తుంచాల్సి ఉంటుంది. సస్యరక్షణ చేపట్టకుండా యూరియా వినియోగిస్తుండటంతో పురుగు నియంత్రణ కష్టమవుతోంది.

నివారణకు వాడాల్సి మందులు:

- మొగిపురుగు నివారణకు వ్యవసాయశాఖ అధికారులు సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది.
- ఎకరాకు 8 కేజీలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు వాడాల్సి ఉంటుంది. లేదా ఎకరాకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 జీ గుళికలను పిచికారీ చేయాలి.
- వరి నారుమడిలో నారు తీసేటప్పుడు గంట ముందు కిలో 4జీ గుళికలు వాడుకోవాలి.
- జింకు లోపాన్ని గుర్తిస్తే 2 కిలోల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఇబ్బందులు పడుతున్నాం

మొగిపురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులు పంటకు పిచికారీ చేస్తున్నాం. పంటకు పురుగు సోకకుండా ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– బ్రహ్మేందర్, రైతు, జిన్నారం

అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. మొగి పురుగు సోకితే రైతులు మాకు సమాచారం తెలిపాలి. మేము సూచించిన మందులు వాడుతుంటే పురుగును నివారించవచ్చు. ఎలాంటి సందేహాలు ఉన్నా మమ్మల్ని సంప్రదించాలి.

– రవీంద్రనాథ్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, జిన్నారం

గంజాయి బ్యాచ్ అరాచకాల వార్తలో నిజం లేదు

హుస్నాబాద్: ఇరువర్గాల గొడవను గంజాయి బ్యాచ్ అరాచకాలుగా ఫేక్ న్యూస్ సృష్టించి వాట్సాప్‌లలో పంపిస్తున్నారని, గంజాయి బ్యాచ్ ఆగడాలు వార్తలో నిజం లేదని ఎస్‌ఐ శ్రీధర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం ఇల్లందుల మల్లయ్య, ఆయన తోడల్లుడు ఎలకంటి రాము కారులో వెళ్తున్నారు. ఫ్రెండ్స్‌మార్ట్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హీనాలవ్ రోడ్డు దాటుతున్నాడు. వేగంగా వస్తున్న కారును చూసి నిదానంగా వెళ్లాలని దురుసుగా చెప్పడంతో ఇరువురు గొడవపడ్డారు. వెంటనే హీనాలవ్ తన స్నేహితులు హుమ్మర్, హుస్సేన్, అదావ్‌కు ఫోన్ చేసి సంఘటనా స్థలానికి రావాలన్నాడు. అందరూ కలిసి దాడి చేయడంతో మల్లయ్య గాయపడ్డాడు. తనపై నలుగురు దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఈ విషయంలో ఎవరూ గంజాయి సేవించలేదని, గంజాయి బ్యాచ్ అరాచకాలని తప్పుడు వార్త సృష్టించి వైరల్ చేయడం మంచిది కాదన్నారు. ప్రజలు ఇటువంటి వార్తలను నమ్మవద్దని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

రోడ్డుపై కారు టైరు మారుస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీ
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు
- చికిత్స కోసం ఆస్పత్రులకు తరలింపు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు టైరు మారుస్తుండగా వెనుక నుంచి ఓ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కొంపల్లికి చెందిన ప్రదీప్ గోయాంక(64) శనివారం తెల్లవారుజామున ఎల్బీనగర్ నుంచి మేడ్చల్‌కు చింతల్‌కు చెందిన డ్రైవర్ ఓం ప్రకాశ్‌తో కలిసి కారులో బయలుదేరాడు. దారి తెలియక డ్రైవర్ పటాన్‌చెరు మండల పరిధి పోచారం సమీప రింగ్ రోడ్డులో కారు వేగం తగ్గించాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వాహనం కారును ఢీకొట్టడంతో కారు టైర్ బ్లాస్ట్ అయ్యింది. దీంతో డీసీఎం డ్రైవర్ మోతీరామ్ వాహనాన్ని పక్కన నిలిపి, కారు వద్దకు వచ్చాడు. కారు డ్రైవర్ ఓం ప్రకాష్, డీసీఎం డ్రైవర్ మోతీరామ్ కారు టైరు మారుస్తున్నారు. ప్రదీప్ గోయాంక రహదారిపై నిలబడి చూస్తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందగా ఓంప్రకాశ్, మోతీరామ్ గాయపడ్డారు. చికిత్స కోసం ఓంప్రకాష్‌ను సనత్ నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా, మోతీరామ్‌ను యశోద ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మోతీరామ్ స్వస్థలం సిద్దిపేట జిల్లా అక్కపేటగా గుర్తించారు.

కాలిన మృతదేహం లభ్యం



కొమురయ్య మృతదేహం

మునిపల్లి (అందోల్): కాలిన మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి బుదేరా శివారులో కాలిన మృతదేహం గొల్ల కొమురయ్య (40)గా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు పంచనామ నిర్వహించి కేసు నమోదుచేశారు. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.


ముగ్గురు నిందితుల అరెస్ట్

తూప్రాన్: హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గొడుగు నరేశ్(28) ఈనెల 21వ తేదీన కనిపించకుండా పోయినట్లు భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నరేశ్ స్నేహితులు ఆబోతు మల్లేశ్, తిప్పాపూర్‌కు చెందిన హమీద్ అలియాస్ నవీన్‌ను అనుమానంతో విచారించారు. మహిళలతో సన్నిహితంగా ఉంటున్నాడని నరేశ్‌పై కక్ష పెంచుకున్నారు. ఎలాగైనా అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు పట్టణానికి చెంది న పర్శ మల్లేశ్ సహాయం తీసుకున్నారు. నరేశ్ తో కలిసి పట్టణ సమీప గడ్డమోలా బండవద్ద మద్యం తాగారు. పథకం ప్రకారం నరేశ్‌ను హత్య చేశారు. అనంతరం సమీపంలోని పాడుబడిన బావిలో మృతదేహాన్ని, అతడి బైక్‌ను పడేశారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోశాలలో కోడెల మృతి

చేగుంట(తూప్రాన్): అక్రమంగా తరలిస్తూ సిద్దిపేటలో పట్టుబడిన పశువులను మాసాయిపేట గోశాలకు తరలించగా వాటిలో మూడు కోడెలు శనివారం సాయంత్రం మృతి చెందాయి. అక్రమంగా తరలిస్తుండగా 43 పశువులను సీపీ శ్వేత మాసాయిపేట గోశాలకు తరలించారు. ఇందులో మరో పది పశువులు అనారోగ్యానికి గురయ్యాయి. అనారోగ్యంతో ఉన్న పశువులకు స్థానిక పశువైద్యాధికారి కావ్య చికిత్స నిర్వహిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



నర్సింలు మృతదేహం

నిజాంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండల పరిధిలోని తిప్పన్నగుల్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన వడ్డే నర్సింలు(38) రెండు నెలల క్రితం వచ్చి మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామంలోని షౌకత్‌పల్లి జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం చేపల వేటకు తిప్పన్నగుల్ల గ్రామంలో ఐదర్‌చెరువు వెళ్లాడు. వేటకు వెళ్లి ఎంతసేపైనా రాకపోవడంతో అతడి భార్య లక్ష్మి చెరువు వద్ద వెళ్లి వెతికింది. అక్కడ చెప్పులు, బట్టలు కనబడటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులతో కలిసి వెతకడంతో మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాములు (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ఐస్‌క్రీమ్ కంపెనీకి వెళ్లి వస్తానని వెళ్లి వ్యక్తి కనిపించకుండాపోయాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరుకు చెందిన రాములు మండల పరిధిలోని ముత్తంగి ఐస్‌క్రీమ్ కంపెనీకి చెందిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతుంటాడు. ఈనెల 27వ తేదీ ఉదయం కంపెనీకి వెళ్లి వస్తానని భార్య మహేశ్వరికి చెప్పి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం అతడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో భార్య కంపెనీలో పనిచేసే ప్రశాంత్‌కి ఫోన్ చేయగా శనివారం ఉదయం 9 గంటలకు ఓ వ్యక్తి రాములును ముత్తంగి మసీదు వద్ద బైక్‌పై డ్రాప్ చేసినట్లు తెలిపాడు. రాములు కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి మృతి



ఖాజామియా మృతదేహం

కోహీర్(జహీరాబాద్): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్ శివారులో శనివారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఖాజామియా కర్ణాటక రాష్ట్రం బీదర్ నివాసి. కొంత కాలంగా కోహీర్‌లో ఉంటున్నాడు. జీవనోపాధి కోసం పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. ఉదయం పశువులను తోలుకొని వెళ్లిన ఖాజామియా కోహీర్, పోతిరెడ్డిపల్లి రైల్వే క్రాసింగ్ సమీపంలో రైలుకింద పడి మరణించాడు. రైలు ఢీకొనడంతో తల గుర్తుపట్టని రీతిలో నుజ్జు అయింది. సుమారు 50 మీటర్ల దూరం వరకు మృతదేహాన్ని ఈడ్చుకుపోయింది. పశువులను తోలే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొందా లేక తానే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే కోణంలో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ ..

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖేడ్ ఈత్వార్‌పేటకు చెందిన బిపాష (45) శనివారం ఇంట్లో పనిచేస్తోంది. విద్యుత్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడింది. కుటుంబీకులు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు ..



నాగరాజు (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడటంతో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన రంగాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన దానప్ప నాగరాజు (35) వారం క్రితం వర్గల్ మండలం అంతగిరిపల్లిలో పొలం దున్నుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అతడిని గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డిటౌన్ : ఆర్థికంగా వెనుకబడిన మహిళల నుంచి ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ద్వారా ఇచ్చే ×సెక్యూరిటీ సూపర్ వైజర్స్ శిక్షణ రెండో బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజరు ఎం. సుగుణ శనివారం తెలిపారు. ఇందుకు ఉమ్మడి జిల్లా పరిధి మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాలవారు అర్హులన్నారు. శిక్షణ కాల పరిమితి మూడు నెలలని, అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. అభ్యర్థినుల భద్రతకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. శిక్షణ తర్వాత ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 30 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంగారెడ్డి బైపాస్‌లోగల జిల్లా మేనేజరు, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) వారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ddugkyard@gmail.com కు మెయిల్ ద్వారా కూడా దరఖాస్తు పంపవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్‌ఎస్‌సి, ఇంటర్ మెమో, ఆధార్ కార్డ్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తోపాటు ఆరు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సమర్పించాలన్నారు.పూర్తి వివరాలకు 94902 42789, 90140 09791, 97030 39541 ఫోన్ నంబర్స్‌లో సంప్రదించవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 1 తేదీ నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 35 మందికి మాత్రమే అవకాశముందని తెలిపారు. మొదట దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.

పని ఇప్పిస్తానని చెప్పి..

- మహిళకు మద్యం తాగించి
- నగలతో ఉడాయించిన కిలేడీ అరెస్ట్
- నాచారం టెంపుల్ వద్ద ఘటన

వర్గల్(గజ్వేల్): పని ఇప్పిస్తానని చెప్పి మహిళకు మద్యం తాగించి ఆమె మెడలోని బంగారు నగలు అపహరించుకుపోయిన కిలాడి చివరకు కటకటాల పాలైంది. ఈఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట వద్ద జరిగింది. వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగుకు చెందిన మేకల శారద(41) కూలి పనులు చేస్తోంది. ఆమె వద్దకు ఈనెల 24వ తేదీన గుర్తుతెలియని మహిళ వచ్చి సిద్దిపేట జిల్లా నాచారం గుట్ట వద్ద ఫంక్షన్ ఉందని, కూరగాయలు తరిగేందుకు ఆడ పనిమనిషి కావాలని, సరైన కూలీ ఇస్తానని నమ్మించి తనవెంట ఆటోలో నాచారం గుట్టకు తీసుకొచ్చింది. అక్కడ వైన్స్ దగ్గర మందు తాగించింది. నిద్ర మత్తులోకి జారుకున్న బాధితురాలు మేకల శారద మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పావుతులం చెవికమ్మలు తీసుకుని ఉడాయించింది. శారదకు మెలకువ వచ్చి చూసుకుంటే తన పుస్తెలతాడు, చెవికమ్మలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నది. వెంటనే గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలో కనపడిన మహిళను బాధితురాలికి చూపించారు. ఆ మహిళ గతంలోనూ గౌరారం పీఎస్ పరిధిలో ఇదే తరహా చోరీకి పాల్పడిన మేడ్చల్-రంగారెడ్డి జిల్లా గాజుల రామారానికి చెందిన కైరంకొండ లక్ష్మీసంతోషి(38)గా గుర్తించారు. శనివారం నాచారం గుట్ట వద్ద నిందితురాలు లక్ష్మీ సంతోషి అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అంత్యక్రియలకు హాజరై తిరిగి వెళ్తూ..

- చెట్టుకు ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరొకరి తీవ్ర గాయాలు



చెట్టును ఢీకొన్న బైక్ (ఇన్ సెట్లో) మృతి చెందిన నర్సింలు

కొల్చారం(నర్సాపూర్): బంధువు అంత్యక్రియలకు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తూ చెట్టును ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొల్చారం మండలం రంగంపేట గ్రామ శివారులోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారిపై శనివారం చోటుచేసుకుంది. కొల్చారం ఏఎస్‌ఐ తారా సింగ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మృతుడు మంగలి నర్సింలు(38), ఎనగండ్ల గ్రామానికి చెందిన బంధువు మంగలి లింగంతో కలిసి బైక్‌పై మండంలోని తుక్కాపూర్‌కు బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం ఇద్దరూ కలిసి అదే బైక్‌పై ఎనగండ్ల గ్రామానికి ప్రయాణమయ్యారు. బైక్ అదుపు తప్పడంతో గంగంపేట శివారు ప్రధాన రహదారి పక్క మర్రి చెట్టుకు ఢీ కొట్టడంతో నర్సింలు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రైవేటు అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మెదక్ ఆస్పత్రిలో లింగం చికిత్స పొందుతున్నాడు. మృతుడు నర్సింలుకు భార్య యశోద, కూతురు, కుమారుడు ఉన్నారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో బైక్ ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడినవారిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎదురెదురుగా బైక్, ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లింగుపల్లి గ్రామానికి చెందిన జోగ్యారి నర్సింహులు శనివారం తన పొలానికి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి మిరుదొడ్డికి వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న లింగుపల్లి గ్రామానికి చెందిన ముత్యాలు, అమృత, నర్సింహులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కాగా నియోజకర్గ పర్యటనలో భాగంగా అటుగా వెళుతున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు తన కారును ఆపి సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, స్థానికుల సహాయంతో గాయపడ్డ ముగ్గురిని అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని మెరుగైన వైద్యం అందించాలని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు ఫోన్ చేసి చెప్పారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఈశ్వరయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నంకరంపేటకు చెందిన వడ్డె ఈశ్వరయ్య(45) టీవీఎస్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. అంబాజీపేట బ్రిడ్జి వద్ద మెదక్ నుంచి వస్తున్న కారు ఢీ కొనడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. వెంటనే మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కారు యజమాని సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స కోసం తరలిస్తుండగా..



పోచయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన మంగలి పోచయ్య (44) వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ రాత్రి బంధువు పండరితో కలిసి బైక్‌పై కూరగాయల కోసం మండలంలోని ఎన్కేపల్లికి బయలు దేరాడు. ఈ క్రమంలో రంగంపేట నుంచి పాపన్నపేట వస్తున్న మరో బైక్ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో పోచయ్య, పండరీ కిందపడటంతో గాయపడ్డారు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలికి చేరుకుని పోచయ్యను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెదక్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం శుక్రవారం రాత్రి గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పోచయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైటింగ్ పోల్‌ను ఢీకొన్న టిప్పర్

డ్రైవర్‌కు తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని నిమ్స్‌కు తరలిస్తున్న 108 సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పోచారం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వెళ్తున్న టిప్పర్ లారీ శనివారం తెల్లవారుజామున పోచారం సమీపంలోని రహదారి మధ్యలో ఉన్న లైటింగ్ పోల్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో డ్రైవర్ సహనవాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.